జేఎన్‌టీయూలో సెనేట్ సమావేశం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో మంగళవారం వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో అకడమిక్ సెనేట్ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా స్నాతకోత్సవం నేపథ్యంలో ఇవ్వనున్న బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలకు ఆమోదం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను ధ్రువీకరించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సెనేట్ సమావేశం నిర్వహించి క్యాలెండర్‌కు ధ్రువీకరణ(ర్యాటిఫికేషన్) ముద్ర వేయాల్సి ఉంది. కానీ, వీసీల మార్పు నేపథ్యంలో జాప్యం జరిగింది. విద్యా సంవత్సరం ముగింపులో ధ్రువీకరించాల్సి వచ్చింది. సెనేట్ సమావేశంలో ఆమోదించిన అంశాలన్నింటికీ స్నాతకోత్సవానికి ముందు జరిగే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ)లో ఆమోదం పొందుతారు. జేఎన్‌టీయూ, స్వీడన్ యూనివర్సిటీ(బీటీహెచ్) ఎంవోయూలో భాగంగా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్(ఐడీడీఎంపీ) చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు మాత్రమే స్వీడన్ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే చదువుకునే అవకాశం కల్పిస్తూ మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.కామాక్షిప్రసాద్ ధ్రువీకరించారు. సమావేశంలో రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ ఎ.చెన్నకేశవరెడ్డి, అటానమస్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి, అఫిలియేటెడ్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ తారాకల్యాణి, ఫారెన్ రిలేషన్స్ డైరెక్టర్ డాక్టర్ వసుమతి తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ ఛైర్మన్‌కు డాక్టరేట్

జేఎన్‌టీయూ నుంచి గౌరవ డాక్టరేట్‌ను ఈసారి ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ టి.జి.సీతారాంకు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. గత స్నాతకోత్సవంలో మాజీ ఇస్రో ఛైర్మన్ డాక్టర్ శ్రీధర పనికర్ సోమనాథ్‌కు వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన విషయం తెలిసిందే. ఈసారి సీతారాంకు ఇవ్వనున్నట్లు తెలిసింది.

కాలేజ్, కోర్స్.. ఎంపిక ఎలా!